
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కృష్ణా
జిల్లా వార్తలు
శనివారం 22 జూన్ 2024

• కొలువుదీరిన ఎమ్మెల్యేలు

అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో జనసేన నుంచి ఒకరు, టీడీపీ నుంచి ఆరుగురు ఉన్నారు. జిల్లా నుంచి ఎన్నికైన ఏడుగురిలో నలుగురు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. వీరిలో వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్ రాజా ఉన్నారు.


కొల్లు రవీంద్ర (బందరు)


బోడె ప్రసాద్ (పెనమలూరు)


యార్లగడ్డ వెంకట్రావు (గన్నవరం)


వెనిగండ్ల రాము (గుడివాడ)


కాగిత కృష్ణప్రసాద్ (పెడన)


వర్ల కుమార్‌రాజా (పామర్రు)


మండలి బుద్ధప్రసాద్ (అవనిగడ్డ)

పరిహారంలో కాలయాపన


రోడ్‌కం రైలు మార్గంకోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి

బందరు పోర్టు రైల్‌కం రోడ్డు మార్గానికి భూములిచ్చిన రైతులకు నగదు జమ చేయకుండా జాప్యం

- అసైన్డ్ భూములకు పరిహారం ఇచ్చేది లేదంటున్న రెవెన్యూ అధికారులు
- పరిహారంపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- నేటి నుంచి నగదు జమచేసిన పట్టా భూముల స్వాధీనానికి మార్కింగ్
- గత పాలకులు, అధికారుల తీరుపై బాధిత రైతుల ఆగ్రహం



బందరు పోర్టు నిర్మాణంలో రోడ్‌కం రైలు మార్గానికి భూములు ఇచ్చిన రైతులను గత ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. రైతుల నుంచి తీసుకున్న భూములకు నగదు జమ చేయకుండా రకరకాలు సాకులు చెప్పి రెండేళ్లుగా కాలయాపన చేసింది. గతేదాడి మే నెలాఖరు నాటికే భూములిచ్చిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పిన రెవెన్యూ అధికారులు ఇంతవరకు పైసా కూడా జమ చేయలేదు. రెండు రోజుల క్రితం కలెక్టర్ డీకే బాలాజీ రోడ్‌కం రైలుమార్గం నిర్మాణం నిమిత్తం తీసుకున్న భూములకు పరిహారం ఇచ్చే అంశంపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి నగదు ఇచ్చిన భూములను స్వాధీనం చేసుకోవాలని అదికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు శనివారం నుంచి రోడ్‌కం రైలుమార్గం కోసం తీసుకున్న భూములను మార్కింగ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరుపోర్టు నిర్మాణంలో భాగంగా రోడ్‌కం రైలు మార్గం నిర్మాణం నిమిత్తం 280 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు రెండేళ్ల క్రితం మూడు విడతలుగా రెవెన్యూ అధికారులు నోటిఫికేషన్లు జారీ చేశారు. కరగ్రహారం నుంచి మేకావానిపాలెం వరకు ముందస్తుగా భూములిచ్చిన రైతులకు అసైన్డ్ భూములకు ఎకరానికి రూ.31.25 లక్షలు చొప్పున, పట్టా భూములకు రూ.45 లక్షలు చొప్పున ధర నిర్ణయించి రైతులకు పరిహారం ఇస్తామని చెప్పారు. ఆ తరువాత 80 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి భూ పత్రాలు సక్రమంగా లేవనే కారణం చూపి నగదు జమ చేయలేదు.

మాట మార్చిన అధికారులు

మంగినపూడి బీచ్ రోడ్డు వెంబడి బందరు పోర్టు పాత శిలాఫలకం సమీపం నుంచి సముద్రం వరకు నిర్మించిన తాత్కాలిక రహదారి ప్రాంతంలో 80 ఎకరాల వరకు అసైన్డ్ భూమి ఉంది. రహదారి ఏర్పాటు చేయకముందు వరకు అసైన్డ్ భూమికి రైతులకు నగదును ఇస్తామని చెప్పిన రెవెన్యూ అధికారులు, రహదారి నిర్మాణం పూర్తయిన తరువాత అసైన్డ్ భూమికి భూమిపత్రాలు సక్రమంగా లేవని, పరిహారం ఇచ్చేది లేదని కొత్తరాగం అందుకున్నారు. బీచ్‌రోడ్ నుంచి సముద్రం వరకు రహదారిలో ఉన్న పట్టా భూములకు మాత్రం ఎకరానికి రూ.45 లక్షల చొప్పున నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు.

రైతులు తిరస్కరించడంతో తొలుత దిగొచ్చిన అధికారులు

బందరుపోర్టు పనులను గతేడాది మే 22వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. పోర్టు పనులు ప్రారంభించక ముందే రోడ్‌కం రైలు మార్గాల నిర్మాణం కోసం భూములిచ్చే రైతులను కలెక్టరేట్‌కు పిలిచి మంతనాలు జరిపారు. పోతేపల్లి ప్రాంతంలో రోడ్‌కం రైలు మార్గాలకు భూములిచ్చే రైతులకు ఎకరానికి రూ.45లక్షలు చొప్పున ధర ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. పోతేపల్లి తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న భూముల ధరను పరిగణనలోకి తీసుకుని భూమి ధరను నిర్ణయించాలని రైతులు పట్టుబట్టారు. దీంతో దిగొచ్చిన రెవెన్యూ అధికారులు ఎకరానికి రూ.45 లక్షలకు బదులుగా రూ.55 లక్షలు భూమి ధరగాను, నగదు ఇవ్వడంలో జరిగిన జాప్యానికి రెండు లక్షల రూపాయలు వడ్డీ సొమ్ముగా కలిపి రూ.57 లక్షలను రైతులకు ఇస్తామని అంగీకరించారు. ఈ ధరకు తమ భూములను ఇచ్చేందుకు రైతులు ముందుకు వచ్చారు.

సాకులతో నగదు జమ చేయకుండా జాప్యం

గతేడాది మే నెలాఖరులోగా భూములిచ్చిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తామని అప్పటి ఎమ్మెల్యే పేర్ని నాని, రెవెన్యూ అధికారులు ప్రకటించారు. అయితే నగదు చేసే సమయంలో భూ పత్రాలు సక్రమంగా లేవని, వెబ్‌ల్యాండ్‌లో కనిపిస్తేనే సవరణలు చేస్తామని రెవెన్యూ అధికారులు సాకులు చెప్పి జాప్యం చేశారు. వెబ్‌ల్యాండ్‌లో సవరణలు చేయాలంటే రైతులు భూమిపత్రాలు తెచ్చుకోవాలని రెవెన్యూ అధికారులు చెప్పి సాచివేత ధోరణితో వ్యవహరించారు. జాప్యంపై రైతులు జేసీకి వివరించారు. అయినా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయ అధికారులు నగదును జమ చేయలేదు. తాము ఇచ్చిన భూములకు నగదు ఇవ్వకుంటే తమ భూముల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు.

కోర్టును ఆశ్రయించిన రైతులు

మంగినపూడి బీచ్ రోడ్ పోర్టు పాతశిలాఫలకం ఎదురుగా పోతేపల్లి వరకు జాతీయ రహదారివైపునకు రోడ్‌కం రైలుమార్గం నిర్మాణం కోసం 55 ఎకరాలకుపైగా భూమిని సేకరించారు. పోతేపల్లి గ్రామ పరిధిలోని భూమికి ఎకరానికి రూ.57 లక్షల చొప్పున ధరగా నిర్ణయించారు. గ్రామ సరిహద్దున ఉన్న పోతిరెడ్డిపాలెంలోని భూమికి ఎకరానికి రూ.45 లక్షల ధర నిర్ణయించారు. దీంతో పోతిరెడ్డిపాలేనికి చెందిన 18 ఎకరాలకు ఎకరానికి రూ.57 లక్షల చొప్పున తమకు పరిహారం ఇవ్వాలని రెవెన్యూ అధికారులను రైతులు కోరారు. అప్పటి మచిలీపట్నం ఆర్డీవో అందుకు అంగీకరించకపోవడంతో రైతులు కోర్టును ఆశ్రయించారు.

పట్టా భూములకు పరిహారం తూచ్..

బందరు మండలం పోతేపల్లిలో 294/1, 295/1, 295/2, చిలకలపూడిలోని 309/2 సర్వే నెంబర్లలోని 9.88 ఎకరాల పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు 2022 డిసెంబరు 15వ తేదీన నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ భూములకు పరిహారం ఇవ్వకుండా ఇప్పటివరకు జాప్యం చేస్తూ వచ్చారు. ఇంతకాలంగా రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఇదిలాఉంటే పోర్టుకు అత్యంత సమీపంలో ఉన్న కరగ్రహారం, గోపువానిపాలెంలలో 80 ఎకరాల అసైన్డ్‌భూమిని రోడ్‌కంరైలు మార్గాల కోసం తీసుకుని రైతులకు నగదును ఇచ్చేది లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీంతో భూమి కోల్పోయిన రైతులు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల కలెక్టర్ పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతాన్ని పరిశీలించి రోడ్‌కం రైలు మార్గాల కోసం తీసుకున్న భూమికి సంబంధించిన వివాదాలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని మచిలీపట్నం తహసీల్దార్, ఆర్డీవోను ఆదేశించారు. ఈ అంశంపై రెవెన్యూ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.



అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరిగింది. శరీరంతో పాటు మనసు శక్తిమంతం కావాలంటే అందుకు ఏకైక మార్గం యోగా అని పలువురు ప్రముఖులు సూచించారు. మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎస్పీ నయీం అస్మీ, కలెక్టర్ బాలాజీ యోగాలో పాల్గొన్నారు.



జిల్లాలో ఏరువాక పౌర్ణమితో ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. నాగలికి, ఎడ్లకు, నేల తల్లికి రైతులు శుక్రవారం పూజలు చేసి దుక్కి పనులు ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండాలని మొక్కుకున్నారు.

తొలి అడుగు

మల్లవల్లిలో మొదలైన పారిశ్రామికాభివృద్ధి


90 శాతం పనులు జరిగి ఐదేళ్లుగా అనాథగా మిగిలి ఉన్న రైల్‌నీర్ ప్రాజెక్టు

- రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పనులు పునరుద్ధరణ
- మెహై ఆక్వాకు బాధ్యతలు అప్పగించిన ఐఆర్‌సీటీసీ
- కొత్త ప్రభుత్వం రాకతో శరవేగంగా పనులు
- ఆగస్టులో ట్రయల్ రన్.. ఆ తర్వాత ప్రారంభోత్సవం
- ఐదేళ్లుగా అనాథగా మిగిలిపోయిన ప్రాజెక్టుకు జీవం

టీడీపీ కూటమి ప్రభుత్వ రాకతో పారిశ్రామిక అడుగులు వడివడిగా పడుతున్నాయి. నిన్నమొన్నటి వరకూ ఎవరికీ కాకుండా మూలనపడి ఉన్న మల్లవల్లి పారిశ్రామికవాడలోకి పరిశ్రమలు ఒక్కొక్కటిగా క్యూ కడుతున్నాయి. తాజాగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నేతృత్వంలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పునరుద్ధరణ పనులు ప్రారంభంకావడం రాజధానికి శుభసూచకమేనని పారిశ్రామిక విశ్లేషకులు చెబుతున్నారు.


పరిశ్రమ లోపల మెషినరీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్) : మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో మరో మధ్య తరహా పరిశ్రమ సాకారంకానుంది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నేతృత్వంలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఐదేళ్లుగా మల్లవల్లిలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ పనులు అడుగు కూడా ముందుకు పడని విషయం తెలిసిందే.

శరవేగంగా పనులు

మొదట్లో ఈ పనులను గుణ్‌రాజ్ అనే సంస్థకు ఐఆర్‌సీటీసీ అప్పగించింది. ఆ సంస్థ ప్లాంట్‌ను 90 శాతం ఏర్పాటుచేసి కొంతమేర మెషినరీ తెప్పించి పనులు చేపట్టకుండా వదిలేసింది. ప్లాంట్ పూర్తి కాకపోవటంతో పాటు మెషినరీ కూడా తుప్పు పట్టే పరిస్థితికి చేరింది. ఈ రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ అనేది పదేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం రైల్వే బడ్జెట్‌లో ప్రవేశపెట్టింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో పరిశ్రమలకు ప్రోత్సాహక పాలసీలతో పెద్ద ఎత్తున సహకారం అందించటంతో ఆ ప్లాంట్ ఏర్పాటుకు భూములను కొన్నారు. పనులు 90 శాతం పూర్తయ్యాయి. బాట్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయటానికి యంత్రాలను కూడా తీసుకొచ్చారు. ఉత్పత్తి ప్రారంభించాల్సిన గుణ్‌రాజ్ సంస్థ అర్థంతరంగా పనులను నిలిపివేసింది. దీంతో ఆ సంస్థను వదిలించుకోవటానికి ఐఆర్‌సీటీసీకి దాదాపు రెండేళ్లకు పైగా సమయం పట్టింది. గుణరాజ్ చెర వీడిన తర్వాత కూడా పనులు ప్రారంభించలేదు.

టీడీపీ ప్రభుత్వం రాకతో..

తాజాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం మల్లవల్లికి పునర్వైభవం లభించింది. ఈ క్రమంలో ఐఆర్‌సీటీసీ కూడా పనులు పునఃప్రారంభించటానికి వీలుగా కొత్త సంస్థకు బాధ్యతలు అప్పగించింది. ఈ రంగంలో విశేష అనుభవం ఉన్న మెహై ఆక్వాకు వీటి బాధ్యతను అప్పగించారు. సదరు సంస్థ యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతోంది. మెషినరీని వెంటనే తీసుకురావడంతో పాటు 24 గంటలూ పనులు చేయిస్తోంది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టులోనే ట్రయల్ రన్ నిర్వహించటానికి మెహై ఆక్వా సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఆగస్టు మొదటి వారంలో రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్ ట్రయల్ రన్ నిర్వహించిన తర్వాత ఐఆర్‌సీటీసీ అధికారుల నిర్ణయం మేరకు ప్రారంభోత్సవం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వేశాఖ మంత్రిని ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయి.

కొడాలి నానిపై కేసు నమోదు

నాయకులు శశి, గొర్లపై కూడా


గుడివాడ, జూన్ 21 : ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు తమను మానసికంగా వేధించి బలవంతంగా రాజీనామాలు చేయించారని గుడివాడలోని 36వ వార్డుకు చెందిన మాజీ వలంటీర్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, ఆయన సన్నిహితుడు దుక్కిపాటి శశిభూషణ్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మరో ఇద్దరు వైసీపీ నేతలపై ఐపీసీ 447, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సరిదిద్దుకోలేని తప్పు చేశా

సెల్ఫీ వీడియో తీసుకుని వివాహిత బలవన్మరణం

- భార్య మరణంతో భర్త ఆత్మహత్య
- విజయవాడలో దారుణం

విజయవాడ, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో సరిదిద్దుకోలేని తప్పు చేశాను. భార్యను పోషించలేని వ్యక్తిని ప్రేమించి పెళ్లాడాను. ఎన్నిసార్లు చెప్పినా ఆయనలో మార్పు రావడం లేదు. చేసిన తప్పునకు నాకు నేనే శిక్ష వేసుకుంటున్నాను. ఓ వివాహిత సెల్ఫీ వీడియోలో చెప్పినమాటలు ఇవి. ఈ వీడియో చిత్రీకరించుకున్న కాసేపటికి ఆమె ఆత్మహత్య చేసుకుంది. అది చూసి భర్త అదే గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దారుణం విజయవాడలో శుక్రవారం జరిగింది. కృష్ణాజిల్లా బంటుమిల్లికి చెందిన నాగరాజు(40), అవనిగడ్డకు చెందిన ప్రణీత (35) ఏడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి పిల్లలు లేరు. రామలింగేశ్వరనగర్‌లోని భవానీ రోడ్డులో అద్దెకు ఉంటున్నారు. నాగరాజు తాపీ పని చేస్తుంటాడు. ప్రణీత ఇంటి వద్ద టైలరింగ్ చేస్తుంది. భర్తను మద్యం అలవాటు వదిలేయాలని పలుమార్లు ప్రణీత ప్రాధేయపడినా ఎలాంటి మార్పూ రాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. తన సెల్‌ఫోన్లో ఓ సెల్ఫీ వీడియో తీసుకుని తాను అనుభవిస్తున్న నరకాన్ని ప్రస్తావించింది. నాగరాజు శుక్రవారం తాపీ పనికి వెళ్లిన తర్వాత మధ్యాహ్నం ఇంట్లో ఉరిపోసుకుంది. భోజనానికి ఇంటికి వచ్చిన నాగరాజుకు బెడ్‌రూంలో ప్రణీత ఉరికి వేలాడుతూ కనిపించింది. ప్రణీత తల్లిదండ్రులకు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. ఇక తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఇంట్లోకి వెళ్లి నాగరాజు అదే గదిలో ఉరిపోసుకున్నాడు. వారు వచ్చి చూసేలోపు భార్యభర్తలిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.



యోగాసనం వేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

యోగతో రుగ్మతలు దూరం

▸ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 21 : యోగ సాధన వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఆబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి రవీంద్రతో పాటు జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి, ఏఎస్పీలు జి.వెంకటేశ్వరరావు, ప్రసాద్‌లతో పాటు పోలీసులు, యోగసాధకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ కార్యదర్శులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. యోగా సాధకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ 1541 మంది విద్యార్థులతో నిర్వహించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2014లో నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించిన యోగాడే పదేళ్లుగా జూన్ 1న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచమంతా జరుపుకుంటోందన్నారు. తమ ప్రభుత్వం యోగ శిక్షణా కేంద్రాలకు ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, యోగా గొప్ప ఆరోగ్య సాధనమన్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో యోగ శిక్షణా తరగతులు ఉద్యోగులకు నిర్వహిస్తామన్నారు. కొవిడ్ అనంతరం యోగాకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతితో యోగా ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖర్, కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ కల్పనా కటాక్షం, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీ, తహసీల్దార్ తోట సతీష్, యోగా శిక్షకులు పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న ఎన్ఎంయూఏ ప్రతినిధులు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

▸ రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎన్ఎంయూఏ వినతి

బస్సు స్టేషన్, జూన్ 21 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ప్రజా రవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరాజు, రావిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి ద్వారకా తిరుమలరావు ఎనలేని కృషి

ఆర్టీసీ ఎండీగా ద్వారకాతిరుమలరావు సంస్థ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఉద్యోగుల సంక్షేమానికి పాటు పడ్డారని ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. డీజీపీగా పదోన్నతి పొందిన ద్వారకాతిరుమలరావును శుక్రవారం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య ఆధ్వర్యంలో జోన్ నాయకులు ఆయనను అభినందించి సత్కరించారు.

అమ్మ ఆశీర్వాదంతో.. అసెంబ్లీకి వెనిగండ్ల



గుడివాడ : తల్లి శాంతమ్మ ఆశీస్సులు తీసుకుని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రమాణస్వీకారానికి సచివాలయానికి బయలుదేరి వెళ్లారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో తల్లి శాంతమ్మకు పాదాభివందనం చేసి.. ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సచివాలయానికి బయలుదేరి వెళ్లారు.

రైతుబజార్‌లో సబ్సిడీపై టమాటాలు

మచిలీపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతుబజార్ల ద్వారా టమాటాలను తక్కువ ధరకు విక్రయించేలా జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ నిర్ణయించినట్లు జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. జేసీ ఛాంబరులో శుక్రవారం జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రతి ఏటా మాదిరిగానే వేసవిలో టమాటా దిగుబడులు గణనీయంగా తగ్గి, ధరలు పెరిగాయన్నారు. చిత్తూరు జిల్లాలో టమాటా కిలో రూ.60నుంచి88ల వరకు ధర పలుకుతోందన్నారు. ఈనేపథ్యంలో ఇంటర్‌నెట్‌లో చూసి ఏ ప్రాంతంలో టమాటా ధరలు తక్కువగా ఉన్నాయో పరిశీలించి, అక్కడినుంచి కొనుగోలు చేసి జిల్లాకు తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. దిగుబడి పెరిగే వరకు వ్యాపారులు లాభాపేక్ష లేకుండా టమాటాలను విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టోకు వ్యాపారుల వద్ద అధికంగా నిల్వలు ఉంచకుండా నియంత్రించేందుకుగాను ప్రతి శుక్రవారం వ్యాపారులు తమ వద్ద ఉన్న నిత్యావసర సరుకుల వివరాలను భారత ప్రభుత్వ పోర్టల్‌లో నమోదుచేయాలని జేసీ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌వో వి పార్వతి, ఉద్యానశాఖ జేడీ జె.జ్యోతి, మార్కెటింగ్ విభాగం డీడీ నిత్యానందం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడివాడ ప్రజలకు అందుబాటులో యూరాలజీ వైద్యసేవలు : పద్మశ్రీ గోఖలే



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న పద్మశ్రీ డాక్టర్ గోఖలే

గుడివాడ, జూన్ 21 : గుడివాడ ప్రజలకు మునుపెన్నడు లేని విధంగా యూరాలజీ వైద్య సేవలను డాక్టర్ యలవర్తి పవన్ గణేశ్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పద్మశ్రీ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గణేశ్ హాస్పటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన గడ్డపై మమకారంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించేందుకు పవన్ గణేశ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, నాయకులు పిన్నమనేని బాబ్జీ, వైద్యులు మన్నెం భవానీ శంకర్, సోమూరి వెంకట్రావు, వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాస్టర్ బర్నబాస్ సజ్జా, డీఎస్పీ పి.శ్రీకాంత్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేటలో డయేరియా పంజా!

▸ వ్యాధి లక్షణాలతో ఇద్దరి మృతి
▸ గ్రామాల్లో పెరుగుతున్న కేసులు
▸ ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద వైద్యం
▸ విషమిస్తే జగ్గయ్యపేట ఆసుపత్రికి
▸ అధికారికంగా 40 మందికి లక్షణాలు
▸ వ్యాధిగ్రస్తులను పరామర్శించిన తాతయ్య
▸ డీఎంహెచ్‌వో, కలెక్టర్ ఆస్పత్రుల సందర్శన

జగ్గయ్యపేట, జూన్ 21 : జగ్గయ్యపేట నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో డయేరియా కలకలం రేపుతోంది. పట్టణంతో పాటు వత్సవాయి మండలం మక్కపేట, వత్సవాయి, కాకరవాయి, షేర్‌మహ్మద్‌పేట, గండ్రాయి, వేదాద్రి గ్రామాల్లో ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. బక్రీద్ పండుగ తర్వాత గ్రామాల్లో కేసులు ఉధృతమైనట్టు వైద్యవర్గాలు చెబుతున్నాయి. శాంతినగర్‌కు చెందిన సత్యానారాయణ (38), చిల్లకల్లుకు చెందిన వెంకటేశ్వరరావు (75) వాంతులు, విరేచనాలతో పాటు హృద్రోగ సమస్యలు ఉండటంతో గురువారం మృతి చెందటంతో వైద్యవర్గాలు అలర్ట్ అయ్యారు. జగ్గయ్యపేట ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు 41 కేసులు నమోదు కాగా, 30 మంది కోలుకొని ఇళ్లకు వెళ్లిపోయినట్టుచెబుతున్నారు. సీహెచ్‌సీతో పాటు పట్టణంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో పలువురు చికిత్స పొందుతున్నారు. మక్కపేటలో కేసుల సంఖ్య అధికంగా ఉంది. ఒకే ఇంట్లో తల్లికూతుళ్లు, మనవరాలు తురకా మంగతాయయ్మ (60) యండ్రాతి మరియమ్మ (40) కీర్తి (15), జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన గుగ్లోత్ జమ్మా (60)లు శుక్రవారం వాంతులు, విరేచనాలతో జగ్గయ్యపేట ఆసుపత్రిలో చేరారు. డాంగేనగర్‌కు చెందిన ఉమ్మినేని రంగయ్య (60), మరియమ్మ (60)ల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వారిని విజయవాడ రిఫర్ చేశారు. వేదాద్రికి చెందిన పసుమర్తి సత్యవతి (65) మక్కపేటలో ఉన్న సోదరి ఇంటికి వెళ్లి వాంతులు విరేచనాలు కావటంతో జగ్గయ్యపేట ఆసుపత్రికి తరలించారు. పట్టణంలో వైవై కాలనికి చెందిన మాదాల రక్షిత (24), మేడా విజయలక్ష్మీ (20)లు రెండు రోజులగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వత్సవాయి మండలం కాకరవాయికి చెంది న తొట్టెంపుడి దివ్యశ్రీ (12), మక్కపేటకు చెందిన ధారావత్ గౌతమి(11), వత్సవాయికి చెందిన నల్లబోతుల నందిని (17)లు మూడురోజులగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హరీష్ చెప్పారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో 12 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌ఓ సుహాసిని తెలిపారు.



జగ్గయ్యపేట ఆసుపత్రిలో వైద్య సేవలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

రాత్రికి రాత్రే డీఎంహెచ్‌ఓ, తాతయ్య ఆసుపత్రి సందర్శన..

డయేరియా లక్షణాలతో యువకుడు, వృద్ధుడు మృతి చెందినట్టు వార్తలు రావటంతో గురువారం రాత్రి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హుటాహుటిన ఆసుపత్రిని సందర్శించారు. విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లటంతో ఆయన వెంటనే డీఎంహెచ్‌ఓను జగ్గయ్యపేట వెళ్లాలని ఆదేశించడంతో ఆమె వచ్చి సమీక్షించారు. షేర్‌మహ్మద్‌పేటకు చెందిన షేక్ రేష్మా, నాగమణిలను విజయవాడ జీజీహెచ్, ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఆదేశాలతో గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. గ్రామంలో నీటి కాలుష్యం అధికంగా ఉందని చెప్పటంతో గ్రామాన్ని సందర్శించారు.

బాధితులను పరామర్శించిన జిల్లా కలెక్టర్

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి ఆసుపత్రిలో రోగులను పరామర్శించారు. షేర్ మహ్మద్‌పేటలో తాగునీటి శాంపిల్స్ పరీక్షలకు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వాతావరణంలో మార్పులు, నీరు మారటం వల్ల డయేరియా లక్షణాలు కనిపిస్తున్నాయని కలెక్టర్ అన్నారు. ఎవరికి లక్షణాలు కనిపించినా ఆసుపత్రికి రావాలని ఆయన కోరారు. జిల్లా అధికారులు డయేరియా మృతిని నిర్ధారించటం లేదు.



చర్యలకు ఉపక్రమించిన మునిసిపాలిటి..

జగ్గయ్యపేట పట్టణంలో డయేరియా లక్షణాలు కనిపించటంతో మునిసిపల్ అధికారులు, చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తక్షణచర్యలకు ఉపక్రమించారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను శుభ్రం చేయించారు. చైర్మన్ వాటర్ వర్క్సును సందర్శించి, క్లోరినేషన్, ఫిల్టరేషన్‌లను పరిశీలించారు. ఎక్కడ వాటర్ లీకేజిలు ఉన్న యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన కమిషనర్ మల్లేశ్వరరావుకు సూచించారు.



వ్యాధి లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు

అతిసారపై అప్రమత్తంకండి

▸ సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు.. అధికారులకు సత్వర ఆదేశాలు

విజయవాడ లీగల్, జూన్ 21 : జిల్లాలో అతిసార వ్యాప్తి చెందకుండా క్షేత్రస్థాయిలో పగడ్బందీ చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ డయేరియాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో కలెక్టర్ హాజరయ్యారు. అతిసార కేసులు నమోదు కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీఎస్ మార్గనిర్దేశనం చేశారు. ఆదేవిధంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమంపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. పటిష్ట ప్రణాళిక ప్రకారం జిల్లాలో అతిసారం వ్యాప్తి చెందకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డయేరియాపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సురక్షిత తాగునీరు, చేతుల పరిశుభ్రత తదితరాలపై అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు సరఫరా, పారిశుధ్య కార్యక్రమాల అమలుపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు నమోదైన చోట మూలాలను గుర్తించి సత్వరం పరిస్థితిని చక్కదిద్దాలని స్పష్టం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ ప్యాకెట్ల పంపిణీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఆరోగ్యశాఖ అధికారుల భాగస్వామ్యంతో ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని, అవసరం మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరంతర వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో వుండాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో డయేరియా కేసులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను నియంత్రించాలన్నారు. తాగునీటి చెరువులు, ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేయాలన్నారు. వర్షాకాలంలో సురక్షిత తాగునీటిని ప్రజలు ఉపయోగించేలా అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తెసరు మద్దతు ధర!

వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఆశాజనకంగా లేవు. పెరుగుతున్న ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెరగటం లేదు. వివిధ పంటల సాగు, ఉత్పత్తి వ్యయాలకు మద్దతు ధరలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఏయేటికాయేడు కంటితుడుపుగా నామమాత్రంగా పెంచుతున్నారు తప్పితే మద్దతు ధరలు నిర్ణయించేటపుడు క్షేత్రస్థాయిలో వాస్తవ వ్యవసాయ ఖర్చులను పరిగణలోకి తీసుకోవటం లేదని రైతులు వాపోతున్నారు.

▸ పెట్టుబడి ఖర్చులు కూడా రావని అన్నదాతల ఆవేదన
▸ ప్రతి ఏటా వేలల్లో పెరుగుతున్న సాగు ఖర్చులు
▸ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రైతుల ఆవేదన
▸ వాస్తవ ఖర్చులు పరిగణనలోకి తీసుకోవాలని రైతు సంఘాల డిమాండ్



కంచికచర్ల : కేంద్ర ప్రభుత్వం 2024-25 సీజన్‌కు సంబంధించి రెండు రోజుల క్రితం మద్దతు ధరలను ప్రకటించింది. ఈ మద్దతు ధరలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావు. ఏయేటికాయేడు పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు పెరగటం లేదు. పంటల ఉత్పత్తిలో సాగుకు అవుతున్న వాస్తవ ఖర్చులను పరిశీలిస్తే రైతుల పెట్టుబడి ఖర్చులకు, ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరకు ఏమాత్రం పొంతన ఉండటం లేదన్నది అవగతమవుతుంది. ఉత్పత్తి వ్యయం బారెడు, మద్దతు ధర మూరెడు అన్నట్టుగా ఉంది. ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇక ప్రకృతి విలయాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చీడపీడలు, వైరస్ తెగుళ్ల తట్టుకోటం చాలా కష్టంగా తయారైంది. ఒకవేళ పరిస్థితులు అనుకూలించినప్పటికీ ఆశించిన దిగుబడులు రావటం లేదు. ఈ పరిస్థితుల్లో మద్దతు ధరలు కూడా రైతులకు గిట్టుబాటు కావటం లేదు. పాలకులు పదో పరకో పెంచి చేతులు దులుపుకుంటున్నారు తప్పితే రైతులకు గిట్టుబాటు అయ్యేటట్టుగా మద్దతు ధరలను నిర్ణయించటం లేదు.

ప్రతియేటా సాగు వ్యయం వేలల్లో పెరుగుతుండగా, మెతుకులు విదిలించినట్టుగా మద్దతు ధరలు పెంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సీజన్‌లో పత్తికి రూ. 501లు పెరిగింది. వరికి సాధారణ రకానికి, ఏ గ్రేడ్‌కు రూ. 117ల వంతున, పెసరకు రూ. 124లు, మినుముకు రూ. 450లు, కంది రూ. 550లు, మొక్క జొన్నకు రూ. 135లు పెరిగింది.

వరుసగా ఐదేళ్లలో ప్రధాన పంటల మద్దతు ధరలు (క్వింటాకు రూ.లలో)

పంట	2020-21	2021-22	2022-23	2023-24	2024-25
వరి(సాధారణ)	1868	1940	2040	2183	2300
వరి(గ్రేడ్-ఏ)	1888	1960	2060	2203	2320
పత్తి	5825	6025	6380	7020	7521
మొక్కజొన్న	1850	1870	1962	2090	2225
కందులు	6000	6300	6600	7000	7550
మినుములు	6000	6300	6600	6950	7400
పెసలు	7196	7275	7755	8558	8682

ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి

పత్తి సాగుకు ఎకరానికి కౌలు సహా సగటున రూ. 50వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చవుతోంది. కౌలుకు ఎకరం పొలం రూ.15 వేలు.. బాగు చేసి విత్తనం వేయటానికి ఐదు వేలకు పైగా అవుతోంది. ఎరువులు, క్రిమిసంహారక మందులకు రూ.15 వేలు, ఎరువులు, మందుల పిచికారికి కూలీల ఖర్చు రూ.ఐదు వేలు, అంతర్ కృషి రూ. మూడు వేలు, ఇక పత్తి తీతకు కూలీల ఖర్చు రూ. 12 వేలకు పైగా అవుతుందని, వెరశి ఎకరం పత్తికి 50 వేల రూపాయలకు పైగా ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రకృతి విపత్తులు, చీడపీడలు, వైరస్ తెగుళ్ల సోకినా దిగుబడి రావటం లేదని, ప్రతికూల పరిస్థితుల్లో పెట్టుబడి వ్యయం ఇంకా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల గణాంకాల ప్రకారం హెక్టారుకు సగటు దిగుబడి 20 క్వింటాళ్లు మాత్రమే. ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల వంతున దిగుబడి వచ్చినప్పటికీ మద్దతు ధర ప్రకారం రైతులకు పెట్టుబడి ఖర్చు రావటం కష్టం. మొదటి తీత రెండు క్వింటాళ్ల పత్తి నాణ్యత తక్కువగా ఉంటుంది. చాలా తక్కువ ధరకు మద్దతు ధరలో సగం కూడా రాదు. ఇక పెట్టుబడికి వడ్డీ, రైతు నిర్వహణ ఖర్చులు కూడా పరిగణలోకి తీసుకున్నట్టయితే నష్టం తప్పితే రూపాయి కూడా మిగలటం కష్టమని అన్నదాతలు స్పష్టం చేస్తున్నారు. సగటున పది క్వింటాళ్లకు మించి దిగుబడి వస్తేనే పత్తి పంట నష్టం ఉండదంటున్నారు.

మిగతా పంటల పరిస్థితి కూడా పత్తి మాదిరిగానే ఉంది. మద్దతు ధరల నిర్ణయించేటపుడు క్షేత్రస్థాయిలో వాస్తవ ఖర్చులను పరిగణలోకి తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు, రైతులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవటం లేదని, ప్రతి ఏడాది కంటితుడుపుగా పెంచటం పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు. నామమాత్రం మద్దతు ధర వల్ల ఏలాంటి ప్రయోజనం లేదని అంటున్నారు.

క్వింటా రూ. పది వేలు ఉండాలి

పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ. పదివేలకు తగ్గకుండా ఉండాలి. మద్దతు ధర రూ. 7,521లకు అమ్మితే మిగలటం ఉండదు. రూ. ఎనిమిది వేలకు పైగా ధర వచ్చినప్పటికీ రైతులకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు. మద్దతు ధర రూ. 10 వేలు చేయాల్సిందిగా రైతులు కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవటం దారుణం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పెట్టుబడిని అంచనా వేసి మద్దతు ధరలు నిర్ణయించినపుడే రైతులకు న్యాయం జరుగుతుందని నందిగామ, కంచికచర్ల ఏఎంసీల మాజీ చైర్మన్లు కోట వీరబాబు, నన్నపనేని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.



డీజీపీని కలిసిన ఎస్పీ..

మచిలీపట్నం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావును మంగళగిరిలోని కార్యాలయంలో కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీజీపీకి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లాలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు చర్యలు

▸ సమీక్షించిన కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ : కృష్ణా జిల్లాలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి క్రీడా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి క్రీడా మైదానాలపై సమీక్షించారు. ఖేలో ఇండియా ద్వారా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలన్నారు. క్రీడా ప్రాంగణాలకు అనువైన స్థలాలు ఎంపిక చేయాలన్నారు. ఇందుకు కావలసిన ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సమావేశంలో శాప్ ఏవో ఎస్ వెంకటరమణ, డీఎస్‌డీఓ ఝాన్సీ , డీఈఓ తాహరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ రెండోదశ కౌన్సెలింగ్.. 111 మందికి అడ్మిషన్లు

భారతీనగర్ : ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లకు శుక్రవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 188 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 111 మందికి అడ్మిషన్లు కేటాయించినట్టు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు పరీక్ష

మోపిదేవి, జూన్ 21 : మోపిదేవిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీలకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ నెల 20, 21 తేదీల్లో మోపిదేవి గురుకుల పాఠశాలలో జరిగిన ప్రవేశ పరీక్షలకు గానూ 6వ తరగతిలో 225 మంది దరఖాస్తు చేసుకోగా, 125 మంది, 7వ తరగతిలో 199 మందికి 108 మంది, 8వ తరగతిలో 179 మందికి 90 మంది, 9వ తరగతిలో 139 మందికి 79 మంది విద్యార్థులు హాజరైనట్టు ప్రిన్సిపాల్ వీర రవి తెలిపారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రమేశ్ పాఠశాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.10

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి

కంకిపాడు, జూన్ 21 : అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు కోరారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి డ్రెయినేజీ వ్యవస్థ తీరుతెన్నులపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి, పచ్చిపాల రాజా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బోడెకు డ్రెయినేజీ ఇబ్బందులు వివరిస్తున్న టీడీపీ నాయకులు

బ్యాంకు డిపాజిట్లపై అవగాహన



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సురేంద్ర జయవర్ధన

గన్నవరం, జూన్ 21 : విద్యార్థులు బ్యాంకు డిపాజిట్ ఖాతాలపై అవగాహన కలిగి ఉండాలని కృష్ణాజిల్లా లీడ్‌డిస్ట్రిక్ మేనేజర్ టి.సురేంద్ర జయవర్ధన అన్నారు. స్థానిక వీకేఆర్ కళాశాల్లో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేర్‌నెస్ వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. డీసీపీ ఎన్‌బీఎం కృష్ణ, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ, నగదు రహిత లావాదేవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. వి.ఆంజనేయులు, దాస్, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, మాధవి, శ్రీనివాసరావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఏరువాక సాగారో..

● రంగన్నగూడెం, వేలేరులో తొలిదుక్కు దున్నిన రైతు నాయకులు



రంగన్నగూడెం, వేలేరులో ఏరువాక ప్రారంభిస్తున్న తెలుగు రైతు నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 21 : వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో ఏరువాక పున్నమి రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు వేర్వేరు కార్యక్రమాల్లో ఆశాభావం వ్యక్తం చేశారు. రంగన్నగూడెం, వేలేరు గ్రామాల్లో శుక్రవారం పూలతో అలంకరించిన ఎద్దులకు పూజలు చేసి నాగలికట్టి తొలి దుక్కిదున్ని ఏరువాకను ప్రారంభించారు. రంగ్నగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆళ్ల గోపాలకృష్ణ తొలి దుక్కిదున్నగా ప్రజాప్రతినిధులు విత్తనాలు జల్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, రైతు ప్రముఖులు మొవ్వా శ్రీనివాసరావు, కొలుసు సత్యనారాయణ, తదితరులతో పాటు పంచాయితీ కార్యదర్శి సురేష్‌కుమార్, వీఆర్‌వో సీమోను, కసుకుర్తి వరలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు. వేలేరులో జరిగిన కార్యక్రమంలో అవిర్నేని భవానిశంకర్, లక్ష్మీ దంపతులు, నాగభూషణచౌదరి, ప్రమీలా రాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు తొలి దుక్కిదున్నగా భవానీశంకర్, తదితరులు విత్తనాలు చల్లారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10మంది అభ్యుదయ పాడిరైతులు, పశుపోషకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండు రంగారావు, ఎదురువాడ శ్రీని వాసరావు, మహిళ కన్వీనర్ ప్రమీలారాణి, టీడీపీ అధ్యక్షుడు కాజ సురేష్, కార్యదర్శి అంగడాల సీతారామయ్య, బాణావతుల శ్రీనివాసరావు, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు, దోనవల్లి రామారావు, షేక్‌గౌస్ పాల్గొన్నారు.

వైసీపీ అడ్డగోలు జీవోలతో అవస్థలు



మంత్రి అనగానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న హరికృష్ణ

కంకిపాడు, జూన్ 21 : వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన అడ్డగోలు జీవోలతో అవస్థలు పడ్డామని దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. దస్తావేజు లేఖర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆయన చాంబర్‌లో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తుమ్మలపల్లి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దస్తావేజు లేఖర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. అనేక అడ్డగోలు జీవోల ద్వారా దస్తావేజు లేకర్ల పొట్టకొట్టే ప్రయత్నం చేశారని, ప్రస్తుతం దస్తావేజు లేకర్లుగా కొనసాగుతున్న వారికి ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేయాలని మంత్రి సత్యప్రసాద్‌ను కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి దస్తావేజు లేఖర్ల సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని హరికృష్ణ తెలియజేశారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 21 : ప్రభుత్వం అందిస్తున్న మౌలికసదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదువుకోవాలని, విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు విద్యార్థులకు సూచించారు. సింగన్నగూడెం ఎంపీయూపీ స్కూల్‌లోని 50మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. శంకర్ పాల్గొన్నారు.

మానవతకు రూ.20వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్, జూన్ 21 : స్థానిక మానవత శాఖకు విశ్వకవి ఇంగ్లీషు మీడియం స్కూల్ యాజమాన్యం శుక్రవారం రూ.20వేలు విరాళం అందజేసింది. మానవత నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సాయంగా విరాళం అందజేసినట్లు స్కూల్ కరస్పాండెంట్ కొమ్మినేని ముఖర్జీ అనిత దంపతులు తెలిపారు. మానవత నాయకులు మారుబోయిన కోటేశ్వరరావు, జయరామ చంద్రరావు, పాటోలు గణేష్‌బాబు, వేగిరెడ్డి సూర్యనారాయణ, దయాల ప్రభాకర్, తదితరులు దాతలను అభినందించారు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

ఉయ్యూరు, జూన్ 21 : వర్షాకాలం ప్రారంభమై వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో పట్టణ పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వి. సత్యనారాయణ అన్నారు. శుక్రవారం వార్డు పారిశుధ్య సెక్రటరీలు, హెల్త్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

అభయాంజనేయస్వామికి ఎమ్మెల్యే బడేటి పూజలు

హనుమాన్‌జంక్షన్, జూన్ 21 : స్థానిక అభయాంజనేయస్వామిని ఏలూరు ఎమ్మెల్యే బడేటీ రాధాకృష్ణ (చంటి) శుక్రవారం దర్శించుకున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో మొక్కు తీర్చుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్వామికి తమలపాకులతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు పావులూరు రామారావు, వడ్డి వాసవి, మట్టా శ్రీను, గరికపాటి నాగేశ్వరరావు, రాజులపాటి రాంబాబు, పంది వీరాం జనేయులు, సగ్గుర్తి శ్రీను, వడ్డి భార్గవ్ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

యార్లగడ్డ విజయంతో మొక్కు చెల్లింపు

గన్నవరం ఎమ్మెల్యేగా యార్లగడ్డ వెంకట్రావు ఘన విజయం సాధించిన నేపథ్యంలో పెరికీడు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బేతాళ ప్రమీలరాణి శుక్రవారం స్థానిక అభయాజంనేయ స్వామి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. యార్లగడ్డ వెంకట్రావు విజయం సాధిస్తే కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ రోజు యార్లగడ్డ శాసన సభలో అడుగుపెట్టి ప్రమాణ స్వీకారం చేయడంతో మొక్కు చెల్లించానన్నారు. యార్లగడ్డ పేరిట ఆమె ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో పెరికీడు టీడీపీ నాయకులు సాలి భాగ్యప్రసాద్, సింగవరపు ప్రసాద్, తాడి లక్ష్మణ్‌బాబు, వెల గపల్లి రామచంద్రరావు, గొట్టాపు ప్రవీణ్, చింతల రవి, బండారు లక్ష్మి ప్రసన్న, మజ్జి రమేష్, కొత్తూరు రేఖ, తెర్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



స్వామి వారికి మొక్కులు చెల్లిస్తున్న ప్రమీలరాణి, పెరికీడు నాయకులు

నిధుల దుర్వినియోగంపై త్రిసభ్య కమిటీ

పెనమలూరు, జూన్ 21 : పెనమలూరు పంచాయతీలో కాంట్రాక్టు కార్మికులు విధులకు హాజరు కాకపోయినా జీతాలు చెల్లిస్తున్నారని, పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఫిర్యాదులపై విచారణకు ప్రభుత్వం తరఫున త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. గుడివాడ డీపీవో, పెనమలూరు విస్తరణాధికారి, చల్లపల్లి పంచాయతీ కార్యదర్శిలతో కూడిన త్రిసభ్య కమిటీ అవకతవకలపై విచారించి సమగ్ర రిపోర్టును మూడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు.

అంటువ్యాధుల నియంత్రణపై అవగాహన



వీరపనేనిగూడెంలో మలేరియా వ్యతిరేక ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గన్నవరం, జూన్ 21 : వర్షాకాల సీజన్ ప్రారంభమైందని అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్కూరు పీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరాజు రాయుడు అన్నారు. మండలంలోని వీరపనేని గూడెంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంటువ్యాధుల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉంచుకూడదని తెలిపారు. ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మీ, ఏఎన్ఎం అనిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గుంతలమయంగా కడవకొల్లు రోడ్డు

ఉయ్యూరు : కడవకొల్లు-పొట్లపాడు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉయ్యూరు-కాటూరు రోడ్డులో కడవకొల్లు నుంచి పొట్లపాడు వెళ్లే రోడ్డు పెద్ద గుంతలు ఏర్పడి వర్షానికి నీరు నిలిచి చెరువుల్లా కన్పిస్తున్నాయి. రాత్రివేళ చీకటిలో రోడ్డుపై వెళ్లేవారు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెనమలూరు, జూన్ 21 : మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ మోర్చా కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో పోరంకి ఉషోదయ స్కూల్‌లో విద్యార్థులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోపిశెట్టి దుర్గాప్రసాద్ టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, యోగా శిక్షకులు ఈశ్వర్, ఉషోదయా కరస్పాండెంట్ యార్లగడ్డ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు. గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇషా ఫౌండేషన్ సహకారంతో యోగా సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్లొమా ఇన్‌చార్జి హేమ, హరిచందన, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి తదితరులు పాల్గొనారు. కానూరు స్కాట్స్‌పైన్ అంతర్జాతీయ పాఠశాలలో అంతర్జాతీయ యో గా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రభూజీ చక్రధారి దాస్, సంస్థ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, ప్రిన్సిపాల్ ప్రతిమ చలసాని, సీఈవో కొడాలి జాహ్నవి తదితరులు పాల్గొన్నారు. కానూరు కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



పోరంకి ఉషోదయ స్కూల్‌లో యోగా దినోత్సవం



ఉషారామ ఇంజనీరింగ్ కాలేజిలో..

ఉయ్యూరు : అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఉయ్యూరులో పలు కేంద్రాల్లో శుక్రవారం యోగాభ్యాసం చేశారు. సాత్విక్ యోగా శిక్షణ కేంద్రంలో యోగా గురువు జి.కృష్ణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఎంకేబాబు విద్యాసంస్థల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రతిరోజు యోగా చేయ డం వల్ల ప్రయోజనాలు యోగా గురువు కృష్ణ తెలియజేశారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల మైదానంలో యోగా గురువు సుబ్బారావు యోగా దినోత్స వం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు, అధ్యక్షుడు సత్తార్, కార్యదర్శి పూర్ణచంద్రరావు, సభ్యులు పాల్గొని సుబ్బారావును సత్కరించారు. జడ్పీ పాఠశాలలో విద్యార్థుల తో యోగాభ్యాసాలు గావించారు. కళాశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీరామ్ పాల్గొన్నారు.

గన్నవరం : యోగాతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో గురు విశ్వస్ఫూర్తి, మానవతా సేవా సంస్థ, వాకర్స్ అసోసియేషన్, మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆడిటోరియంలో బీజేపీ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. నాయకులు నాదెండ్ల మోహన్, కానూరు శేషుమాధవి పాల్గొన్నారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠ శాలల్లో ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మీ యోగాపై అవగాహన కల్పించారు. ● ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఫౌండేషన్, విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈషా ఫౌండేషన్ నుంచి ఎం.సురేష్ యోగాసనాలు చేయించారు.

హనుమాన్‌జంక్షన్ : ప్రతి రోజు క్రమం తప్పకుండా చేసే యోగా సాధనతో శరీరంతో పాటు మనసు అదుపులో ఉండి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం ఉంటుందని బాపులపాడు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం టీవీ నాగేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ యోగాసానాలపై పీడీ వెకంటేశ్వరరావు అవ గాహన కల్పించారు. తేలప్రోలు ఉషారామ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులు యోగాభ్యాస ప్రదర్శన నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ యోగా సాధనపై అవగాహన కల్పించారు. 150 మంది విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శ్రీహరిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి, రేమల్లె, వేలేరు తదితర హైస్కూళ్లలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. రేమల్లె హైస్కూల్‌లో దారపురెడ్డి బాస్కరరావు వివిధ యోగాస నాలను వేసి విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో పీడీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, రాజేష్, పార్థసారథి, వెలమర్తి రవిబాబు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరవల్లి హైస్కూల్‌లో పీడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తూ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రాము, రమణగోపాల్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేలేరు హైస్కూల్‌లో పీడీ టాన్యాగిరి పర్యవేక్షణలో విద్యార్థులు యోగాసనాలతో పాటు సూర్యనమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కొమ్మా విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆరుగొలను, కానుమోలు హైస్కూళ్లలో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



ఉయ్యూరులో...



బాపులపాడు హైస్కూల్‌లో...

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.10

రేషన్ బియ్యం రీ సైక్లింగ్ జరిపితే కఠిన చర్యలు : డీఎస్‌వో

చల్లపల్లి, జూన్ 21 : రేషన్ బియ్యం రీ - సైక్లింగ్ జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిణి పార్వతి హెచ్చరించారు. చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎస్‌వో మాట్లాడుతూ, రేషన్ సరఫరాపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. కార్డుదారుల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. డీలర్లపై, ఎండీయూ ఆపరేటర్లపై ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. తహసీల్దార్ బి.సుమతి, పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జి ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.



చల్లపల్లిలో యోగా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్



గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



పులిగడ్డ గురుకుల విద్యాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు



స్వతంత్రపురం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినుల యోగా



పమిడిముక్కల జడ్పీస్కూల్‌లో పద్మాసనం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా భారతదేశానికి గర్వకారణం ● ప్రపంచ యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, జూన్ 21 : యోగా భారతదేశానికి గర్వకారణమని ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ పార్కులో ప్రపంచ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, శారీరక, మానసిక వికాసం అందించే యోగా భారతదేశంలో వేదకాలం నుంచీ ఉందన్నారు. సత్యసాయి ధ్యానమండలి, లంకపల్లి సత్య సేవా యోగ మండలి సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువు శ్రీనివాస్ నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి జ్యోతి వెలిగించారు. తుంగల గిరి, ముమ్మనేని నాని, దాసి సీతారామరాజు, బోలెం రామారావు, గొల్లపూడి రాజేంద్ర, మోహనరావు, రేవతి, అడపా గురవయ్య, కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్, పీవీ.మాధవేంద్రరావు, బోలెం నాగమణి, ధ్యానమండలి సభ్యులు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** మచిలీపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లేడీయాంప్థిల్ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యాశాఖాధికారి సాల్మన్‌రాజు, ప్రిన్సిపాల్ ఆనంద కుమార్, ప్రసాద్, రాజకుమారి, రేఖ, విజయలక్ష్మి, వరలక్ష్మి, నర్మద, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు. ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద చింతయ్య, ఎల్ఐసీ ఉద్యోగుల శిక్షణా కేంద్రంలో ఏవో ఝాన్సీ, మంగినపూడి బీచ్ వద్ద మాస్టర్ రమేష్ యోగా శిక్షణ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ యోగసభ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. భవిరి శంకరనాథ్ శిబిరాన్ని ప్రారంభించారు. మాదివాడ రాము, డాక్టర్ హనుమంతయ్య, పల్లపోతు సీతారామకృష్ణ, ఆర్.డి.ప్రసాద్, హరికృష్ణ పాల్గొన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో యోగా డే జరిగింది. యెండూరి సురేష్, అన్నం అశోక్, వేముల కృష్ణ, నరసింహమూర్తి, శ్రీదేవి, నిర్మల, పి.వి. మోహనరావు, గజేంద్ర పాల్గొన్నారు. **బంటుమిల్లి :** మానవ జీవితంలో యోగా దిన చర్యగా ఉండాలని బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం. భాస్కరరావు అన్నారు. సివిల్ కోర్టు, కాంతి కేంద్రంలో యోగా డే నిర్వహించారు. యోగా గురువు వాసును ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు,



బంటుమిల్లి కోర్టు ఆవరణంలో ...



మచిలీపట్నంలో యోగసభ ఆధ్వర్యంలో రక్తదానం

కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. **పెడన రూరల్ :** నందమూరు వాసవీ ఇంజనీరింగ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, హెచ్ఎం ప్రభాకరరావు, దోసపాటి బాబా, ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి పాల్గొన్నారు. **గుడివాడ :** యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా మిత్ర కె.డి.వి.ఎన్ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ స్టేడియంలో 1000 మందికి యోగా శిక్షణ అందించారు. ఎఎన్ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు ఎల్.ఆర్.కె ప్రసాద్, కార్యదర్శి కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యమ్.శివనాథ్, గ్రంథాలయాధికారి పద్మజ, ఎన్‌సీసీ అధికారి సలీం, ఎన్.ఎస్.ఎస్ అధికారి ఎం.జేసుబాబు, వ్యాయామోపాధ్యాయులు వీర్ల గోపి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దిలీప్ ఆధ్వర్యంలో గాయత్రి పరివార్ సహకారంతో శ్రీనివాస్ యోగాసనాలు వేయించారు. కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా.ఎస్.హెచ్.వి ప్రసాదరావు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్.ఇ.ఆర్.ఎం హైస్కూల్ ప్రాంగణంలో యోగాసనాలు వేశారు. యోగా శిక్షకులు చినరాయుడు, శ్రీనివాస్‌లను సన్మానించారు. మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, పొట్లూరి రవికుమార్, వై.పి.సి ప్రసాద్, జంగం మోహనరావు, పీడీ రామ్మోహన్, కోలా రాధా కృష్ణ, వెనిగళ్ల నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ట్రెజరర్ మేరుగు పెరుమాళ్ళు పాల్గొన్నారు. **పామర్రు :** జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో పద్మవాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అడ్డాడ, జమీదగ్గుమిల్లి హైస్కూల్స్‌లో యోగా అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఇందిరారాణి, ఉపాధ్యాయులు ఎ. బ్రహ్మానాయుడు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎఎన్ఎం హైస్కూల్లో యోగడేలో ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరెడ్డి, ఉషోదయ హైస్కూల్లో ప్రిన్సిపాల్ ఎండి రఫీ పాల్గొన్నారు. మార్కెట్‌యార్డు ఆవరణలో వాసవీ వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువును సత్కారించారు. ఘంటసాల సాయిరామ్, కంచర్ల వీర జనార్దన, చిన్నం సుధాకర్, చంద్రమౌళి, నాంచారయ్య, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** ఎస్‌విఎల్.క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఎస్.టి.పి.కుమార్, వ్యాయా మోపాధ్యాయులు జి.వీరకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. గాలి గోపురంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్రగడ్డ రాజశేఖర్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. యోగాసనాలు వేశారు. భోగాది చంద్రశేఖర్‌రావు, మునగాల బాలకృష్ణరావు, కోలా శ్రీమన్నారాయణ, విద్యార్థులు, పాల్గొన్నారు. **నాగాయలంక :** అమృత సరోవర్ ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలతో ఉపాధి పథకం ఏపీవో టివిఎన్.ముత్యాలు యోగాసనాలు వేయించారు. మండలి ఉదయభాస్కర్, బండ్రెడ్డి శివపార్వతీ, మెండు లక్ష్మణరావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, బడుగు వెంకన్న పాల్గొన్నారు. జడ్పీ పాఠశాలలో వ్యాయామోపాధ్యాయులు విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. **కోడూరు :** స్వతంత్రపురం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఎంఈవోలు రామదాసు, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఆల వెంకటరమణ, ఉపాధ్యాలు పాల్గొన్నారు. **మోపిదేవి :** గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.వీర రవి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. **కూచిపూడి :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఎం.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. కాజలోని ఆయుష్ వైద్యశాల, జడ్పీ పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా శిక్షకులు మందా మా ధవి, హరీష్ రెడ్డి, నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామస్థులకు యోగా ప్రయోజనాలు వివరించారు. హెచ్ ఎం రమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. హెచ్ఎం వక్కలగడ్డ కేశవనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ, అరుణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వక్కలగడ్డలో ఏరువాక పూజల్లో రైతులు, మహిళలు, అధికారులు



కాజలో ఏరువాక పూజతో పొలం పనులు ప్రారంభిస్తున్న సీతారామిరెడ్డి



కొడాలిలో దుక్కి దున్ని పనులు ప్రారంభిస్తున్న తుమ్మల చౌదరిబాబు

పల్లెల్లో సంప్రదాయబద్ధంగా ఏరువాక

చల్లపల్లి, జూన్ 21 : ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అవనిగడ్డ నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో వక్కలగడ్డలో శుక్రవారం ఏరువాక రైతు మహోత్సవం (ఏరువాక పౌర్ణమి) ఘనంగా నిర్వహించారు. గోగినేని రత్తయ్య పొలంలో కాడి ఎద్దులకు, నాగలికి పూజలు చేసి దుక్కి దున్నారు. నేల తల్లికి పూజలు చేసి ఖరీఫ్ సాగు ఆశాజనకంగా సాగాలని కోరుకున్నారు. రైతుసంఘం రాష్ట్ర నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, నియోజవకర్గ అధ్యక్ష కార్యదర్శులు వేమూరి రత్నగిరిరావు, ఆట్లూరి వెంకటేశ్వరరావు, పోతుమర్తి నాగమణి, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, పశువైద్యాధికారులు డాక్టర్ మనోజ్, డాక్టర్ వినోద్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** కాజ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం జిల్లా అధ్యక్షుడుపేకేటి సీతారామిరెడ్డి దంపతులు ఏరువాక పౌర్ణమి పూజలు నిర్వహించి ఖరీఫ్ పనులు ప్రారంభించారు. వేదపండితులు అగ్నిహోత్రం శేషాచార్యుల ఆధ్వర్యంలో నాగలికి, ఎద్దులకు, పుడమి తల్లికి పూజలు చేసి దుక్కి దున్ని పనులు ప్రారంభించారు. **ఘంటసాల :** కొడాలిలో ఎడ్లకు నాగలి కట్టి దుక్కి దున్నే పనులను సంప్రదాయబద్ధంగా మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు ప్రారంభించారు. పంటలు బాగా పండాలని కోరుతూ పుడమి తల్లికి పూజలు చేశారు. రైతు ప్రతినిధి బండి పరాత్పరరావును ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు కంఠమనేని రాజగోపాలరావు (గోపి), బండి యశ్వంత్, బండి పరాత్పరరావు, పరుచూరి శ్రీనివాసరావు, వీరంకి నాగరాజు, బొందలపాటి చక్రధర్, తుమ్మల శివయ్య, అయినపూడి శ్రీనివాసరావు, పట్టాభి పాల్గొన్నారు. తాడేపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఏడీఏ శ్యామల, ఏవో మురళీకృష్ణ, మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, బండి పరాత్పరరావు, సూరపనేని శివరామప్రసాద్, ఆదర్శ రైతు ఉప్పల ప్రసాదరావు, యార్ల శ్రీకాంత్, మట్టా రాజారావు, రత్తయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీచింగ్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు : ఎలకుర్రు కేడీబీ ట్రస్టు ఆధ్వర్యంలో రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాచే గుర్తింపు పొందిన స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాలలో రెండేళ్ల టీచర్ ట్రైనింగ్‌కు సమానమైన డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కేడీబీ ట్రస్టు కార్యదర్శి కాశీనాధుని నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. అడ్మిషన్లకు చివరి తేదీ ఈ నెల 27వ తేదీగా పేర్కొన్నారు. వివరాలకు 8500885168, 9959103856 సంప్రదించాల్సిందిగా కోరారు.

కె.కొత్తపాలెంలో అంకమ్మ తల్లి జాతర

మోపిదేవి : కె.కొత్తపాలెంలో అంకమ్మ తల్లి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేకనూరులో అంకాలమ్మ జాతర

అవనిగడ్డ రూరల్ : వేకనూరులో మాదివాడ అంకాలమ్మ తల్లి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి గాజులతో అలంకారం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మాదివాడ శ్రీనివాస పెరుమాళ్ల పర్యవేక్షించారు.

పైడమ్మ ఆలయ వ్యవస్థాపకులు తోట నాగేశ్వరరావు మృతి



పెడన రూరల్ : పైడమ్మ ఆలయ వ్యవస్థాపకులు తోట నాగేశ్వరరావు (90) శుక్రవారం కన్నుమూశారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బందరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఈవో తిక్కిశెట్టి రామ్మోహనరావు, పలువురు ప్రముఖులు నాగేశ్వరరావు మృతికి సంతాపం తెలిపారు.

విద్యార్థుల హాజరు పెరగాలి

గుడ్లవల్లేరు : పాఠశాలలో విద్యార్థుల హాజరు పెంచాలని, మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించేలా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఎంఈవో జి.గోపాలరావు అన్నారు. జేమ్స్ పేట పాఠశాలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హాజరు పట్టీలను, విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

గుడ్లవల్లేరు : నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ సునిల్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. రెవెన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఆర్ఐ షకీలా బేగం తదితరులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాల్లో జనసేన టీచర్స్ ఫెడరేషన్ శాఖలు



మచిలీపట్నం టౌన్ : అన్ని జిల్లాల్లో జనసేన టీచర్స్ ఫెడరేషన్ శాఖలు ప్రారంభిస్తున్నట్లు జనసేన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు ఏ. రాము తెలిపారు. జనసేన నాయకులు కొట్టె వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో భవిష్యత్ ప్రణాళికపై చర్చించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి కె.సాయి, తెలుగు యువత రాష్ట్ర నాయ కుడు వాలిశెట్టి విమనేష్, జనసేన నాయకుడు కొట్టె వెంకట్రావు పాల్గొన్నారు.

కె.కొత్తపాలెంలో నాడు - నేడు పనులపై విచారణ

మోపిదేవి : కె.కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు - నేడు పనులపై ఎంఈవో రాజ్ కుమార్ గ్రామస్థుల సమక్షంలో విచారణ నిర్వహించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు మత్తి లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పాఠశాలకు విచ్చేసి పనులను పరిశీలించారు. ఇనుము, సిమెంట్ ఇతర మెటీరియల్ మాయమైనట్లు గుర్తించటం జరిగిందని గ్రామస్థులు ఎంఈవో దృష్టికి తీసుకొచ్చారు. బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడి కాలంలో ఎక్కువ పనులు జరిగినట్లు నాడు - నేడు ఏఈ అజయ్ ఎంఈవోకు తెలిపారు. పూర్తి వివరాలను రాత పూర్వకంగా అందజేయాలని ఎంఈవో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ శాఖ సహాయకులకు ఆదేశించారు. గ్రామస్థులు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, దుట్టా శివరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి జడ్పీ పాఠశాల హెచ్ఎం మృతి



శేషసాయి కుమార్ (ఫైల్ ఫొటో)

కూచిపూడి : కూచిపూడి జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.శేషసాయి కుమార్ శుక్రవారం విజయవాడలోని ప్రైవేట్ వైద్యశాలలో మృతి చెందారు. ఈనెల 19వ తేదీ బుధవారం అస్వస్థతకు గురైన ఆయనను విజయవాడలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. శేషసాయికుమార్ కృషితో చినముత్తేవి, కూచిపూడి జడ్పీ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. హెచ్ మృతి పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నందివాడ : యువకులు మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని డీఎస్పీ శ్రీకాంత్ హితవు పలికారు. ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్ర వారం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రూరల్ సీఐ ఏసుబాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడకం, అమ్మకం వివరాలు వెంటనే తెలియపర్చాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డి సాయిబాబా ఆలయం 27వ వార్షికోత్సవం

చల్లపల్లి : పాగోలు షిర్డి సాయిబాబా నిలయంలో 27వ వార్షిక ఆరాధనా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈనెల 13వ తేదీన సాయిబాబా జీవిత చరిత్ర పారాయణతో ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. క్షీరాభిషేకం, సహస్రనామ పూజలు జరిగాయి. కంఠంనేని అప్పయ్యచౌదరి - రమాదేవి దాతృత్వంతో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కోవెలమూడి అరుణకుమారి పర్యవేక్షించారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి బంగారు పతకం



పామర్రు : దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కంచర్లరామారావు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రదానోప్యాధాయురాలు ఇందిరారాణి అన్నారు. పదో తరగతిలో ప్రతిభచూపిన పెనుమూడి స్నేహితకు పట్టణ ఆర్య వైశ్య ప్రముఖుడు వూటుకూరి చలపతిరావు రూ.20 వేల బంగారు పతాకాన్ని శుక్రవారం ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. దాతను ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు ప్రోత్సాహకాలు

పెదపారుపూడి : వెంట్రప్రగడ జడ్పీ హైస్కూల్‌లో టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన వై.బిందు అమూల్యకు రూ.15 వేలు, ద్వితీయ స్థానం సాధించిన సిహెచ్.రాంచరణ్‌కు రూ.10 వేలు, తృతీయ స్థానం సాధించిన కె.ప్రవల్లికకు రూ.5 వేలు బహుమతిగా కాట్రగడ్డ నాగేశ్వరరావు, చోడవరపు బసవాచారి అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విద్యార్థులకు రూ.1000 చొప్పున వెంట్రప్రగడ గ్రామ అభివృద్ధి కమిటీ పక్షాన వక్కినేని శ్రీరాములు అందించారు. దాతలకు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్.ఎన్. గొల్లపాలెంలో పుస్తకాల పంపిణీ



మచిలీపట్నం టౌన్ : భావి బారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. ఎస్ ఎన్ గొల్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రవాసాంధ్రుడు వర్రే శివ సహకారంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, వాటర్ బాటిల్స్ , పౌష్టికాహారం అందజేశారు. జనసేన కార్పొరేటర్ ఛాయాదేవి మాట్లాడుతూ, తల్లితండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్ఆర్ఐ వర్రే శివ, నగర జనసేన అధ్యక్షుడు గడ్డం రాజు, పినిశెట్టి వేణు, తోట రాజేష్, చంద్రం యశ్వంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవళ మహర్షి జయంతి



పెడన రూరల్ : దేవాంగ కులదైవం దేవళ మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. పరమ శివుని ఆజ్ఞతో దేవళ మహర్షి వస్త్రం తయారు చేసి దేవతలకు అందించాడు. వారి సంతతిగా ఉన్న దేవాంగ కులస్థులు బ్రహ్మపురంలోని రామలింగ చౌడేశ్వరి గుడిలో యువజన భక్తబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కొలుకుల వారి వీధిలోగల యువజన గ్రంథాలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో కనకం వెంకటేశ్వరరావు పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంచారు. గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలోని శివాలయం వద్ద భక్తులు దేవళ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు.

అద్దంకి నాంచారమ్మ హుండీల లెక్కింపు 27న

కోడూరు : విశ్వనాథపల్లిలోని అద్దంకి నాంచారమ్మ హుండీ కానుకలను ఈనెల 27వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో సిహెచ్.సుధాకర్‌రావు తెలి పారు. ఉదయం 10 గంటలకు దేవస్థానం ముఖమండపంలో దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహిస్తామని, ఆసక్తి గల భక్తులు డ్రెస్‌కోడ్ నిబంధనలతో పాల్గొనవచ్చునని తెలిపారు.